క్లుప్తంగా

బోయకొండలో రాహుకాల పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే అమ్మవారి గర్భాలయాన్ని అర్చకులు శుద్ధి చేశారు. గంగమ్మతల్లికి ప్రత్యేక అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె : స్థానిక బాటగంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రచ్చబండకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నేతలు, గ్రామస్తులు

పుంగనూరు : మండలంలోని ఏడూరు గ్రామంలో రచ్చబండ నిర్మాణానికి గ్రామస్తులు శుక్రవారం భూమిపూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు వాటర్‌షెడ్ నిధుల నుంచి రూ.2లక్షలు వెచ్చించి రచ్చబండ నిర్మిస్తున్నట్లు సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ ధనుంజయవర్మ, కమిటీ చైర్మన్ మునిరాజా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం


కృష్ణయ్య(ఫైల్)

సదుం : మండలంలోని గూలబారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కృష్ణయ్య (70) తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. కృష్ణయ్య అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు.

29న కంటి వైద్యశిబిరం

పలమనేరు : పట్టణంలోని లయన్స్‌సేవాకేంద్రంలో ఆదివారం కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు లయన్స్ క్లబ్ నిర్వాహకుడు రవి మాట్లాడుతూ బోగరాజు నాగరాజు జ్ఞాపకార్థం శిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

చౌడేపల్లె: మండలంలోని ముదిరెడ్డిపల్లె సమీపంలో శుక్రవారం ఆటో బోల్తాపడడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన వంశీ, గణపతి ఆటోలో చౌడేపల్లెకు వచ్చారు. ట్రాక్టర్ టైర్లు వేసుకుని తిరుగుప్రయాణమయ్యారు. గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను 108లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు పాము కాటు

చౌడేపల్లె : గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు పొలంలో పని చేసుకుంటుండగా పాము కాటుకు గురయ్యాడు. స్థానికుల సాయంతో కుటుంబసభ్యులు 108లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పథంలో పల్లెలు


వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- సేవకు సచివాలయాలు
- వ్యవ'సాయం' కోసం రైతు భరోసా కేంద్రాలు
- అందుబాటులో విలేజ్ క్లినిక్‌లు
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : గ్రామీణాభివృద్ధి పరుగులు తీస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శుక్రవారం మండలంలోని మొరం గ్రామంలో రూ.93.80లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, పాల డెయిరీ, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క గ్రామంలోనే అభివృద్ధి పనులకు దాదాపు రూ.కోటి వెచ్చించామన్నారు. అయితే టీడీపీ నేతలకు ఇవి కనిపించవని, కేవలం ప్రజను మభ్య పెట్టేందుకే అసత్య ప్రచారాలకు తెరతీస్తుంటారని విమర్శించారు. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణలు చేసేవారని, ఇప్పుడు ఆ దుస్థితి లేదన్నారు. ప్రభుత్వ సేవలన్నీ ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, సాగుకు అవసరమైన సలహాలు ఎక్కడికక్కడ ఆర్‌బీకేల్లో అందుతున్నాయని వెల్లడించారు. గతంలో అనారోగ్యానికి గురైతే పలమనేరుకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆయా గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉంటున్నాయని, అలాగే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింది ఇంటి వద్దకే వైద్యులు వస్తున్నారని వివరించారు. నియోజకవర్గంలోని 90 పంచాయతీల్లో సుమారు రూ.100కోట్ల వ్యయంతో ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల వద్దకే సేవలు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఇంత అభివృద్ధి చేసినా పల్లెలో ఏమీ చేయలేదని టీడీపీ నాయకులు చెబుతుంటే వారిని నిలదీయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. గతంలో సర్పంచుల ఇంటిముందున్న అరుగుల్లో పాలన సాగేదని, పంచాయతీ కార్యదర్శులకు కనీసం గది కూడా ఉండేది కాదనే విషయాన్ని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యులు మల్లిక రంగనాథం, వైస్ ఎంపీపీలు జయశ్రీ బాలాజీనాయుడు, గజేంద్రబాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠలో..

పలమనేరు మండలంలోని నక్కపల్లె వద్ద నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, కుంభాభిషేకంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ కుమారుడు అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిరెడ్డి, శీనా, వెంకట్రామిరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, ఈశ్వర, గాలి సుబ్రమణ్యం నాయుడు, వెంకట్రమణ పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి సంతాపం

పెద్దపంజాణి : మండలంలోని గుట్టూరు గ్రామానికి చెందిన రెడ్డెప్ప(68) గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం గ్రామానికి చేరుకొని మృత దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబాన్ని ఓదార్చి సంతాపం తెలియజేశారు. అదే విధంగా ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సర్పంచ్ ధనంజయ రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకునేలా పాలన


లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎన్నికల హామీలన్నీ అమలు
- ప్రతి కుటుంబానికీ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా, ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెంగుబళ్ల, శెట్టిబళ్ల, శివకురుబూరు, వడివానికొత్తూరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. అయితే వంచనకు అలవాటు పడిన దుష్ట కూటమి ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. పేదలకు లబ్ధి చేకూరితే సహించలేని టీడీపీ నేతలు అసత్య ప్రచారాలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మోసపు సర్వేల పేరుతో తప్పుడు సమాచారాన్ని జనంపై రుద్దేందుకు పన్నాగాలు పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు కేవలం తన అనుకూల మీడియా, పొత్తులు, కుతంత్రాలను నమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారని స్పష్టం చేశారు. పాదయాత్రలు, బస్సు యాత్రలతో మాయమాటలు వల్లించేందుకు వస్తున్నారని, అయితే వాస్తవాలు గమనిస్తున్న ప్రజలు తగు బుద్ధి చెబుతారని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో కుప్పంతో సహా మొత్తం 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నేతలు కోదండరెడ్డి, చెంగప్ప, కృష్ణమూర్తి, విజయకుమార్, మురుగేష్, సర్పంచ్ పూలకుంట భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు స్థలాలు


పెద్దపంజాణి : స్థలం కేటాయిస్తున్న తహసీల్దార్


సోమల : భూ పత్రాలు అందిస్తున్న తహసీల్దార్

పెద్దపంజాణి : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలం కేటాయిస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోగిలేరులో 290-5 సర్వే నంబర్‌లో స్థలం మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పరంధామ, పీఎస్ గణపతి, వీఆర్‌ఓ సుధాకర్, సర్వేయర్ అజిత, నాయకులు శివశంకర్ రెడ్డి, గౌతంరెడ్డి పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ఎర్రగుంతలవారిపల్లె, రాంపల్లె, అన్నెమ్మగారిపల్లె ఎగువ, దిగువ దళితవాడల శ్మశానవాటికలకు తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి శుక్రవారం స్థలాలను కేయించారు. కార్యక్రమంలో సర్వేయర్ షానవాజ్, పంచాయతీ కార్యదర్శులు మణికుమార్, లలిత, వైఎస్సార్‌సీపీ నేత రమణారెడ్డి, వీఆర్‌ఓలు మురళి, వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఎంవీఐ రవీంద్రనాయక్

పుంగనూరు : వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎంవీఐ రవీంద్రనాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతావారోత్సవాలు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపకూడదన్నారు. అలాగే డ్రైవింగ్ చేసేప్పుడు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. దీనిపై సహచర డ్రైవర్లకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. మితిమీరిన వేగం అనర్థదాయకమని చెప్పారు. డీఎం సుధాకరయ్య, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ సంధ్య, గ్యారేజ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు కరీముల్లా, రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు : పట్టణంలోని ఓఎల్ఎల్‌యూపీ పాఠశాలలో జగనన్న గోరుముద్దపై ఎంఈఓ లీలారాణి శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మిడ్డేమీల్స్ నిర్వహణపై తనిఖీ చేసేందుకు రాష్ట్రస్థాయి అధికారుల బృందం రానున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలకు గుడ్లు, చిక్కీలు, ఫోర్టిఫైడ్ రైస్ సక్రమంగా అందుతోందా అనే విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం


అలివేలును సన్మానిస్తున్న సీడీపీఓ రాజమ్మ

బైరెడ్డిపల్లె : గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న బైరెడ్డిపల్లె ఎంఈఓ సాయి లీలను శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రామచంద్ర, షాబుద్దీన్, అంజలి, స్వర్ణలత, వెంకటరమణ, ఐఈఆర్‌టీ నిర్మలకుమారి పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డు అందుకున్న అలివేలును సీడీపీఓ రాజమ్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమ, అక్కయ్య, చంద్రకళ, భారతి, స్వర్ణ, జూనియర్ అసిస్టెంట్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్ లావణ్య పాల్గొన్నారు.

ఉత్తమ కార్యదర్శికి అభినందన

ఉత్తమ అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శి నాగరాజాను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సీరాజు స్నీసా, వార్డు మెంబర్లు చిన్న నాగరాజా, లక్ష్మయ్య పాల్గొన్నారు.


ఎంఈఓ సాయిలీలను సత్కరిస్తున్న సీఆర్పీలు

నేటి నుంచి 'గడప గడపకు'

గంగవరం : మండలంలో శనివారం నుంచి నాలుగు రోజులు పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మేలుమాయి, కలగటూరు పంచాయతీల్లో చేపట్టనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

టి.వడ్డూరులో పొలంబడి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంధ్య

పలమనేరు : మండలంలోని టి.వడ్డూరు శుక్రవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఏఓ సంధ్య మాట్లాడుతూ వరి సాగులో నారుమడుల నుంచి కోతల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆర్‌బీకే సిబ్బంది సింధు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునస్వామి పాల్గొన్నారు.

సచివాలయాల పట్టణ కన్వీనర్‌గా వరదారెడ్డి



పుంగనూరు : పట్టణంలోని సచివాలయాల కన్వీనర్‌గా వరదారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్ ఆధ్వర్యంలో గ్రామ సారథులను ఎంపిక చేశారు. ఈక్రమంలో వరదారెడ్డిని కన్వీనర్‌గా నియమించినట్లు చంద్రహాస్ వెల్లడించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, లయన్స్ క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ పాల్గొన్నారు.

సమయ పాలన తప్పనిసరి


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

సోమల : సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అన్నెమ్మగారిపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ షానవాజ్, పంచాయతీ కార్యదర్శి లలిత పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం


పోషకాహారం పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె : తీర్థం పీహెచ్‌సీలో వైద్యాధికారి అరుణ్‌కుమార్ శుక్రవారం పలువురు టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ రోగులకు మందులతో పాటు పోషకాహారం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అందుకే కందిపప్పు, రాగిపిండి, శనగపప్పు, నూనె, చక్కెర, గోధుమపిండి, ఎండు ఖర్జూరం, గుడ్లు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పద్మావతి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజా

సోమల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ నాగరాజా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పొదలగుంటపల్లె, ఎస్.నడింపల్లె పంచాయతీల్లోని జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. సకల సౌకర్యాలు కల్పిస్తున్నా ఇళ్లు నిర్మించుకోవడంలో లబ్ధిదారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు. బిల్లులను సకాలంలో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పొదలగుంటపల్లె సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జావీద్, సర్పంచులు జయరాం, వెంకటరమణ, మాజీ సర్పంచ్ సదాశివయ్య, పంచాయతీ కార్యదర్శి జైశంకర్, సబితమ్మ, వాటర్‌షెడ్ చైర్మన్ డిసెంబర్‌రావు పాల్గొన్నారు.

అద్భుతంగా అష్టావధానం


అవధానంలో పాల్గొన్నవారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పలమనేరు : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అద్భుతంగా అష్టావధానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మల్లెల నాగరాజు అవధానిగా, ప్రముఖ కవి మాధవరెడ్డి సమన్వయం చేశారు. 8మంది ప్రాశ్నికులుగా వ్యవహరించారు. నిషిద్ధాక్షరిగా తారకరామ, దత్తపదిగా బ్రహ్మానందం, సమస్యగా సిద్ధార్థ, న్యస్తాక్షరిగా బాలకృష్ణ, వర్ణనగా దేవరాజులు, పురాణ పఠణికులుగా తులసీనాథం నాయుడు, ఆశువుగా శివశంకర్‌రెడ్డి, అప్రస్తుత ప్రసంగికులుగా జొన్నగడ్డల శ్రీరామచంద్రమూర్తి కీలకపాత్ర పోషించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ తెలుగుభాష, సంస్కృతిని కాపాడుకునేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. అనంతరం అవధానంలో పాల్గొన్నవారిని ఘనంగా సత్కరించారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన


మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న శంకర్

గుడిపాల: జలజీవన్ మిషన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జలవనరుల ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్ అన్నారు. ఆయన శుక్రవారం కమ్మతిమ్మాపల్లె పంచాయతీలో జలజీవన్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ కార్యాచరణ ప్రణాళికలు, గ్రామ భాగస్వామ్య పద్ధతులను ఎలా నిర్వహించాలి అన్న విషయమై వివరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మురళీకష్ణ, రఘునాథరెడ్డి, రామారావు, సర్పంచ్ కోమల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

రథసప్తమికి ముమ్మర ఏర్పాట్లు


విద్యుద్దీపాలంకరణలో ఆలయం

నగరి : పట్టణంలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో శనివారం నిర్వహించనున్న రథసప్తమి కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయ గోపురానికి ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. టీటీడీ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు తిరుమంజనం, ప్రత్యేక పూజలు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవం పాల్గొన దలిచిన దంపతులు శనివారం మధ్యాహ్నం రెండు గంటల లోపు రూ. 500 చెల్లించి రశీదు పొందాలని సూచించారు. దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేశారు.